గ్రామాల్లో సాగు సందడి షురూ

- మొదలైన నారుమడులు, వరి నాట్లు
- బిజీగా మారిన రైతులు



వరి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



వరి నాట్లు వేస్తున్న కూలీలు



నాటడానికి సిద్ధంగా ఉన్న వరి నారు

పాలకోడేరు: గ్రామాల్లో సాగు సందడి నెలకొంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో అన్నదాత సాగు పనుల్లో బిజీ అయ్యాడు. ఈ ఏడాది ఖరీఫ్ లో అదునుకి వర్షాలు కురవలేదు. అందువల్ల వరి వరి నాట్లు వేయడానికి ఆలస్యమైంది. వర్షాలు కురవకపోవడంతో కాలువల్లో నీటి ప్రవాహం లేక కొంత మంది ఆసక్తి ఉన్న రైతులు మోటార్ ఇంజిన్లతో నీరు తోడుకుని నారుమడులు వేశారు. దీంతో కొన్నిచోట్ల వరి నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం కొంతమంది రైతులు నారు పోసుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో గ్రామాల్లోని రైతులు కూలీలు బిజీగా ఉన్నారు. ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు మండలంలో10,400, ఉండి1880 ఎకరాలు, కాళ్ల 3900, ఆకివీడు మండలంలో 4100 ఎకరాల్లో వరిసాగు చేస్తారు. అయితే ప్రతి ఏడాది జూలై మాసంలో పూర్తి శాతం ఆకుమడులు వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో కనీసం 40 శాతం కూడా వరి నాట్లు పూర్తవ్వలేదు. ఇటీవల వర్షాలు కురవడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ సీజన్లో ఉండి నియోజకవర్గంలో 29 వేల ఎకరాలు వరి సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మంచి దిగుబడులు పొందాలంటే అధికారులు సూచనలు సలహాలు పాటించాలని సూచించారు.

విత్తనాల ఎంపిక ఇలా

రైతులకు ఉన్న నీటి వసతికి అనుగుణంగా స్వల్ప కాలిక, మధ్యకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి. అంటే 150 రోజుల పంట వ్యవధి గల ప్రస్తుత మార్కెట్ లోని రకాలను ఎంపిక చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. లైసెన్స కలిగిన డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. అలాగే ముఖ్యంగా సంచి పై ఉన్న వివరాల్లో మొలక శాతం తదితర విషయాలను గమనించాలి వారి నుంచి విధిగా రసీదు పొందాలని పేర్కొన్నారు.

ప్రధాన పొలం తయారీనే చాలా ముఖ్యం

పొలాన్ని రెండు మూడు సార్లు బాగా కలియదున్నలి మడిలో నీరు ఎక్కువగా లేకుండా బురద పదును లేకుండా పెరుగు పదును ఉండేలా చూసుకోవాలి. పొలంలో ఇసుక ఎక్కువ గా ఉంటే ఒక ఇంచు నీరు ఉండేలా చూసుకోవాలి., కయ్యలో సమానంగా విత్తనాలు పడేలా చూసుకోవాలి చదరపు మీటర్ కు 33 కుదుళ్లు, కుదురుకు రెండు లేదా మూడు మొక్కలు ఉండేలా చూడాలి.

వరి సాగుకు మూడు పద్ధతులు

వరిని మూడు ప్రధాన పద్ధతిలో సాగు చేస్తారు. నారును పెంచి తిరిగి ప్రధాన పొలంలో నాటడం, నేరుగా ప్రధాన పొలంలో విత్తనాలను చల్లడం, మొలకెత్తిన విత్తనాలు డ్రమ్‌సీడర్ ద్వారా పొలంలో విత్తడం. డ్రమ్ సీడర్ లేదా నేరుగా విత్తనాలు చల్లే పద్ధతుల్లో రైతుకు సాగుకు అయ్యే ఖర్చులో ఎకరానికి రూ 3 వేలకు పైగా తగ్గించుకోవచ్చు. కూలీల సమస్యను అధిగమించవచ్చు విత్తన ఖర్చు తగ్గుతుంది. పంటకాలం కూడా పది రోజులు తగ్గించుకోవచ్చు మొక్కల సాంద్రత సరిపడా ఉంటుంది. దిగుబడి ఎకరాకు ఇప్పుడు బస్తాలు అధికంగా వస్తుంది.

సాగునీటికి ఇబ్బంది



నారుమడులు దశలో సాగునీటికి చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం వర్షాలు కురవడం వల్ల వరి నాట్లు వేసుకోవడానికి సన్నద్ధమయ్యాం. ప్రస్తుతం సాగునీరు పొలాలకు అందుతుంది. మా గ్రామాలు కాలువ శివారు వల్ల ప్రతి ఏడాది సాగునీటి ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. అధికారులు ప్రజాప్రతినిధులు సాగునీటి ఇబ్బంది లేకుండా కాలువలను ప్రక్షాళన చేస్తే సాగునీటి సమస్య పునరావృతం కాదు.

– ఎం.జగన్‌మోహన్, మోగల్లు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



దేశానికి వెన్నుముక రైతు. అలాంటి రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. ప్రస్తుతం పాలిస్తున్న కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కింది. ఏడాది గడిచిన రైతుకు ఈ ప్రభుత్వం వల్ల ఒరిగిందేమీ లేదు. అన్నదాత సుఖీభవ, తదితర పథకాలను అమలు చేయడం లేదు. పథకాలు ద్వారా ఎంతో కొంత సాయం చేస్తే సాగు పెట్టుబడికి ఆసరాగా ఉపయోగపడుతుంది.

– జి.వెంకన్న గరగపర్రు

వరి నాట్లు జోరందుకుంటున్నాయి



ఇప్పటి వరకు 20 నుంచి 30 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. పంట సాగుకు ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలి. ఫలితాలను బట్టి ఎరువులను వాడాలి. అలాగే వరి సాగు చేసేవారు లేత నారు కట్ చేసి నాటుకోవాలి. వరి మడిలో కాలి బాటలు ఏర్పాటు చేస్తే మొక్కకు గాలి వెలుతురు బాగా తగులుతుంది. నత్రజని ఎరువులు మూడు భాగాలుగా వేయాలి.

– సంధ్య మండల వ్యవసాయ అధికారి, పాలకోడేరు

క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి



విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

వీరవాసరం: ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని చింతలకోటిగరువు సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, ఉప సర్పంచ్ దాసరి మాణిక్యాలరావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడైన కొల్లిపర శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పేర్లపై పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందన్నారు. అస్సలు పనులకు వెళ్లకుండానే ఒక్కో పేరు మీద 11 రోజుల నుంచి 180 రోజుల వరకు ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు మస్తర్లలో నమోదు చేశారని అన్నారు. పని జరిగే సమయంలో మాత్రం ఎక్కడ ఎలాంటి ఫొటోలు కూడా ఆ వ్యక్తులు లేకుండా మస్తర్లు మాత్రమే ఉంచారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఉందని మండిపడ్డారు.

బ్యానర్ చించితే ప్రజాభిమానం ఆగుతుందా?



గొంతే హరీష్

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్‌లు చించినంతమాత్రాన ఆయనపై ఉన్న ప్రజాభిమానాన్ని ఆపలేరని గుర్తుంచుకోవాలని పాందువ్వ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొంతే హరీష్ అన్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన ఉండటంతో పంచాయతీ కార్యాలయం వద్ద జంక్షన్‌లో కట్టిన జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చించివేశారని పేర్కొన్నారు. దీనిపై హరీష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ బ్యానర్‌లు చించినంత మాత్రాన ప్రజాభిమాన్ని ఆపగలమని అనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పొందలేకపోతుందని ఇకపై మరింతగా దిగజారిపోవడం ఖాయమన్నారు.

కాళ్లకూరి వెంకన్నకు ప్రత్యేక పూజలు

కాళ్ల: మండలంలోని కాళ్లకురు గ్రామంలో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణమాస మొదటి శనివారం నేపత్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు అష్టోత్తర శతనామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఏర్పాట్లను ఈఓ అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక క్విట్ ఇండియా స్థూపం వద్ద శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కార్గిల్ యుద్ధ వీరులను ఘనంగా సన్మానించారు. బీజేపీ కార్యకర్తలు పట్టణంలో వీధుల్లో కాగడాలతో నినాదాలు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అయినంపూడి శ్రీదేవి, దత్తు ప్రసాద్, కాయిత సురేంద్ర, కోరా రామ్మూర్తి, ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

కాళ్ల: ప్రాత్తాళ్లమెరక గ్రామంలోని చినపేట ప్రాంతవాసులంతా ఐకమత్యంగా శుభపరిణామమని విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ అధినేత వేగిరాజు శివవర్మ అన్నారు. గ్రామంలోని చినపేటలో రూ.42.50 లక్షలతో దాతల సహకారంతో నిర్మించిన సీబీసీఎన్‌సీ బాప్టిస్ట్ చర్చి కమ్యూనిటీ హాల్‌ను దాతలు కనుమూరు రామకృష్ణంరాజు, వేగిరాజు శివవర్మ, కనుమూరు గోపాలరాజు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంతేటి ఉషా శ్రీనివాసరాజు, మంతెన పద్మరాజు, మంతెన మురళీకృష్ణంరాజు, కనుమూరు సూర్యనారాయణరాజు, కంతేటి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా శ్రీవారికి సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ చేసి ఊంజల్ సేవ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాళ్ల కార్యకర్తల సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పీవీఎల్ నరసింహరాజు



ఉండి కార్యకర్తల సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు కూటమి ప్రభుత్వం, చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం కాళ్ల, ఉండి మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాదిరిగా అబద్ధపు హామీలు ఇచ్చి ఉంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి యువతను, మహిళలను మోసం చేశారని చెప్పారు. పేదప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. చంద్రబాబు మోసాల వల్ల ప్రజలకు కలిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. యువతకు నిరుద్యోగ భృతి పేరుతో మోసం చేశారని చెప్పారు. తల్లికి వందనం అందరికీ ఇవ్వలేదని ఆరోపించారు. ప్రతి ఆడబిడ్డకు నెలకి రూ.15 వందలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మలని కూటమి మంత్రులే అంటున్నారంటే విచారకరమని ఘాటుగా విమర్శించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను సైతం మోసం చేశారన్నారు. దీపం పథకం అమలు చేయకుండానే అమలు చేసినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానని చెప్పి ప్రజలను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు తప్ప రాష్ట్ర అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మండల అధ్యక్షులు గ్రామాల వారీగా ఏ విధంగా ప్రజల్లోకి వెళ్లాలనే విషయాన్ని చర్చించుకోవాలన్నారు. ఈ కార్యక్రమల్లో భాగంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ తెలియజేసే బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, కొండేటి శివకుమార్, ఉండి ఎంపీపీ శ్రీహరి రాజు, రణస్థల మహంకాళి, బడుగు బాలాజీ, పెనుమత్స ప్రసాదరాజు, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, మంతెన సునీల్ వర్మ, డొక్కు సుబ్రమణ్యం, వీరమల్లు బోసు, సుంకర భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెడుతుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమమైందని, దీంతో విద్యా సంవత్సరం పూర్తి చేసుకొని కొత్త కోర్సుల్లో జాయిన్ అవ్వాలనుకొనే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు విద్యను ఎలా కొనసాగిస్తారు? అనిప్రశ్నించారు. ఇప్పటికైనా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మానసిక వైద్యశాలల పరిశీలన



వైద్య సదుపాయాలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి హనీషా

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా శనివారం టూటౌన్ లోని శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక వైద్యశాలలను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి, వారి మానసిక స్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి న్యాయపరంగా ఎటువంటి సలహాలు, సూచనలు అవసరమైనా మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు జీవీ.రమణరావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి, ఉచిత న్యాయవాదులు పి.అంబేద్కర్, ఎస్.సుధీర్, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయబద్ధంగానే ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక

ఆకివీడు: ఈస్ట్ ఆకివీడు బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక న్యాయబద్ధంగానే జరిగిందని, ఒకరిద్దరు చేస్తున్న అసత్య ప్రచారం తగదని నూతనంగా ఏర్పడిన ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ పేర్కొంది. ఈ మేరకు శనివారం స్థానిక ఉల్వర్టన్ పేట చర్చి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కుర్రెళ్ల రవి ప్రకాష్ మాట్లాడుతూ గత రెండేళ్లగా ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు జరగకపోవడంతో కార్యకలాపాలు స్తంభించాయన్నారు. ఇటీవల సిద్ధాపురం గ్రామంలోని చర్చిలో 10 సంఘాల సభ్యులు సమావేశమై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారని చెప్పారు. మరో రెండు సంఘాల సభ్యులు హాజరుకాలేదన్నారు. వారికి కూడా నూతన కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పారు. త్వరలోనే నూతన కమిటీ పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో కార్యదర్శి జే.జోసఫ్‌రాజు, కోశాధికారి సుందర సింగ్, సభ్యులు బొద్దు వజ్రం, మండా ఏసు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘ సమావేశం

ఆకివీడు: ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం విస్తృత స్థాయి సమావేశం స్థానిక రైస్ మిల్లర్స్ భవనంలో ఆదివారం నిర్వహిస్తామని జిల్లా సంఘ అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార వృత్తిలో విశిష్ట సేవలందించిన వారికి అత్యుత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. స్వర్ణవృత్తి పరిరక్షణపై, బ్యాంకు అప్రయిజర్స్ సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు.

చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడీ విద్య పునాది



మహదేవపట్నంలో ఈసీసీఈ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందించే విద్య వారి భవిష్యత్‌కు పునాది వంటిదని సీడీపీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మీ అన్నారు. శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే(ఈసీసీఈ) సందర్భంగా మహదేవపట్నం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని శ్రీలక్ష్మీ, సీడీపీఓ వాణీ విజయరత్నం ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్‌ను అద్భుతంగా తీర్చిదిద్ది వారి జీవితానికి దారి చూపించేలా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు.

గొల్లవానితిప్పలో పిచ్చికుక్క స్వైర విహారం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి గాయపరిచిందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం స్కూల్‌కు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు, ఏడుగురు పెద్దలు, ఒక ఆవును కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాబిస్ వ్యాక్సిన్‌ను వేయించుకున్నారు. ఆ పిచ్చికుక్క ఎవరిని కరుస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందారు. వీధికుక్కలు మందలుగా తిరుగుతూ భయపెడుతున్నాయని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

సమస్యల వలయంలో అప్పారావుపేట

- తాగునీటికి కటకట
- మురుగునీటి పారుదలకు డ్రెయిన్ సౌకర్యం లేని వైనం



అప్పారావుపేట గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



సీసీ డ్రెయినేజీ లేక కచ్చా డ్రెయిన్‌లో ప్రవహిస్తున్న మురుగు నీరు

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీరంలో ఉన్న అప్పారావుపేట గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ గ్రామ జనాభా 1500. అయితే గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండు మంచినీటి చెరువులున్నాయి. అయినప్పటికీ ప్రజలకు రా వాటరే అందిస్తున్నారు. ఫిల్టర్ చేయకపోవడంతో ప్రజలు ఆ నీటిని వాడకానికి మాత్రమే వినియోగిస్తున్నారు. వేసవిలో వాడకానికి కూడా నీరు పనికిరాని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆ సమయంలో మురుగునీరే శరణ్యమంటున్నారు.

కానరాని సీసీ డ్రెయిన్

గ్రామంలోని పలు వీధుల్లో ఒక్క సీసీ డ్రెయిన్ నిర్మాణం జరగలేదు. గ్రామంలోని మురుగు నీరంతా కచ్చా డ్రెయిన్ల ద్వారానే బయటకు పోతుంది. వర్షం వస్తే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని ఆయా వార్డుల్లోని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సీసీ డ్రెయిన్ నిర్మాణానికి పంచాయతీ పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

గ్రామమంతా ఒక్క సీసీ రోడ్డే

గతంలో గ్రామంలోని పలు వీధుల్లో గ్రావెల్, మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షం కురిస్తే బురద రోడ్లలోనే నడవాల్సి వస్తుంది. గ్రామంలోని ప్రధాన రోడ్డుకు సీసీ రోడ్డు చెరువు చుట్టూ గతంలో నిర్మించారు. ప్రస్తుతం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. గుమ్ములూరు–అప్పారావు పేట రహదారి మరింత అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని స్థితి. నడిచి వెళ్లడమే కష్టంగా ఆ రహదారి ఉంది. గ్రామంలో మంచినీటి సమస్య, రోడ్ల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో మంచినీటి చెరువు

గత కొన్నేళ్లుగా గ్రామంలో మంచినీటి చెరువు ఒక్కటే ఉంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు పర్యవేక్షణలో గ్రామంలో రెండో మంచినీటి చెరువును తవ్వించారు. మంచినీటి వ్యవస్థను మెరుగు పరచేందుకు చర్యలు తీసుకున్నారు. ఇరుకు గదుల్లో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనం స్థానంలో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో హరిజనపేట, యాదవ పేట, పంచాయతీ, శివాలయం వీధిలలో సీసీ డ్రెయిన్లను నిర్మించారు. తమ గ్రామంలో అభివృద్ధి ఛాయలు వైఎస్సార్ సీపీ పాలనలోనే కనిపించాయని ప్రజలు చెబుతున్నారు. కూటమి ఏడాది పాలనలో గ్రామంలో ఒక్క సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.